## క్లుప్తంగా

### దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జీవీఆర్

**మానకొండూర్‌రూరల్‌:** మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నిరుపేద వృద్ధులకు అభయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో పేదలను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని సంస్థ జిల్లా కోఆర్డినేటర్‌ అరుణ ప్రభంజన్‌ తెలిపారు.

### ప్రతి ఒక్కరూ టీబీ పరీక్ష చేసుకోవాలి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

**మానకొండూర్‌:** ప్రతి ఒక్కరూ టీబీ పరీక్ష చేసుకోవాలని టీబీ ప్రోగ్రాం జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. టీబీ క్యాంపెయిన్‌ నిక్షయ్‌ శివిర్‌ కార్యక్రమాన్ని మానకొండూర్‌లో శనివారం ప్రారంభించిన అనంతరం రాజీవ్‌నగర్‌ కాలనీలో మాట్లాడారు. గ్రామంలోని వారందరూ 60 సంవత్సరాలు పైబడిన వారందరూ, బీపీ షుగర్‌ ఉన్నవారు, పొగ, మద్యం తాగే వారు తప్పనిసరిగా టీబీ పరీక్ష చేసుకోవాలని తెలిపారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే త్వరగా నయమవుతుందన్నారు. పరీక్షలు చేసుకోకపోతే ఇంట్లో ఎవరికైనా టీబీ ఉన్నా ఇట్లో వారికి సోకే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వివరాలు సేకరిస్తారని టీబీ గూర్చి ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. కార్యక్రమంలో డా. సౌమ్య, మహ్మద్‌ సల్మాన్‌, సీహెచ్‌వో రాజునాయక్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ జుబేర్‌, స్నేహలత, ఏటీఎస్‌ సదయ్య, ఎఎన్‌ఎం ఇందిరా పాల్గొన్నారు.

### వెలిచాల, దత్తోజీపల్లిలో పశువైద్య శిబిరాలు



వెలిచాలలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌

**రామడుగు:** మండలంలోని వెలిచాల, దత్తోజీపల్లి గ్రామాల్లో శనివారం పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, పశు వైద్య కళాశాల కోరుట్ల, పశుసంవర్ధకశాఖ రామడుగు ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌ మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశు వైద్య కళాశాల కోరుట్ల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ దాసరి శ్రీనివాస్‌ ప్రారంభించారు. ఈసందర్భంగా పశువులకు వైద్యులు వివిధ పరీక్షలు, చికిత్సలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, రామడుగు సింగిల్‌ విండో ఉపాధ్యక్షుడు గంట్ల రవీందర్‌రెడ్డి, వైద్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, శకారం, అంబిక, శ్రీనివాస్‌, అనిల్‌, జగన్మోహన్‌రెడ్డి, రవి, విశాల్‌, సురేష్‌, రవికాంత్‌, ప్రియాంక, సాయిచరణ్‌ రామడుగు, వెదిర పశువైద్యాధికారులు అనిల్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి



మాట్లాడుతున్న యువ చైతన్య సభ్యులు

**గన్నేరువరం:** మండలంలోని చాకలివానిపల్లె గ్రామంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో యువ చైతన్య సభ్యులు ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. యూత్‌ అసోసియేషన్‌ గ్రామ అధ్యక్షుడు రేపాక బాబు మాట్లాడుతూ.. మొక్కలు మనిషి జీవనానికి ఎంతో తోడ్పడుతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బామండ్ల శంకర్‌, రేపాక శ్రీనివాస్‌, కోడూరి లక్ష్మన్‌, బామండ్ల నర్సయ్య, బామండ్ల అనిల్‌, సుంకపాక శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

### అరెస్ట్‌ అప్రజాస్వామికం

**హుజూరాబాద్‌:** ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని, కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ కేసులు పెరుగుతున్నాయని, నియంతపాలనకు నిదర్శనంగా నిలుస్తోందని బీఆర్‌ఎస్‌ హుజూరాబాద్‌ నియోజకవర్గ యూత్‌ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ శనివారం ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఒక్క హామీని నెరవేర్చలేదని, సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాతీర్పు తెలుస్తుందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడుతూ పోరాటం మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న హెల్త్‌ ఎద్యుకేటర్‌ మోహన్‌రెడ్డి

**జమ్మికుంట:** తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని హెల్త్‌ ఎద్యుకేటర్‌ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్‌ పరిధిలోని పిట్టల వాడ అంగన్‌వాడీ కేంద్రంలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, అన్నప్రాసన నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ అసిస్టెంట్‌ నరేందర్‌, ఆరోగ్య మహిళ కార్యకర్తలు సాజిదా పర్వీన్‌, రాధా, అంగన్‌వాడీ టీచర్‌ కవిత, ఆశాలు సుజాత, అయా తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్‌ క్రీడా పోటీలు ప్రారంభం



హుజూరాబాద్‌: పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు, తదితరులు

**చొప్పదండి:** పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సీఎం కప్‌ క్రీడా పోటీలను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ గుర్రం నీరజ, వైస్‌ చైర్‌ పర్సన్‌ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కమిషనర్‌ నాగరాజు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్‌ కొత్తూరి మహేశ్‌, ఎంఈవో శ్రీనివాస్‌ దీక్షిత్‌, హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, పెరుమాండ్ల గంగయ్యగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

**హుజూరాబాద్‌:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్‌ పోటీలను శనివారం ఆర్డీవో రమేశ్‌బాబు ప్రారంభించారు.

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్‌ స్కూల్‌లో శనివారం సీఎం కప్‌ పోటీలను మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్‌ ప్రారంభించారు. వాలీబాల్‌, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ ఉదయ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ మల్లారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వీర్‌పాల్‌రెడ్డి, ఆశాలు, రాజశేఖర్‌, కుమార్‌ పాల్గొన్నారు.



చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్‌-సుందరగిరి గ్రామాల మధ్య ప్రమాదకర మూలమలుపుతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయంభయంగా ప్రయాణం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారులు
అనురాగ్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్‌ నం. 9441621614

**వాట్సాప్‌ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

# పనితీరు సరిగా లేనివారిపై చర్యలు

### మున్సిపల్‌ కమిషనర్‌ ఎండీ అయాజ్‌



మాట్లాడుతున్న కమిషనర్‌ ఎండీ అయాజ్‌

**జమ్మికుంట:** మున్సిపల్‌ పరిధిలో వర్తక, వాణిజ్య, గృహ, నల్లా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కమిషనర్‌ ఎండీ అయాజ్‌ అన్నారు. శనివారం మున్సిపల్‌ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్‌ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జమ్మికుంట పట్టణ అభివృద్ధికి ప్రజలు పన్నులు చెల్లించాలని, ఇప్పటి వరకు 51శాతం పన్నులు వసూలయ్యాయని, వందశాతం వసూలు చేయాలని సూచించారు. పనితీరు సరిగా లేనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్‌ రాజిరెడ్డి, ఏఈ నరేష్‌, రెవెన్యూ అధికారి భాస్కర్‌, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతికి సహకరించాలి



మాట్లాడుతున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

**గంగాధర:** విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించడానికి తల్లిదండ్రులు సహకరించాలని, విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని మధురానగర్‌ చౌరస్తాలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకున్నపుడే ఉత్తమ ఫలితాలు సాధించగలని, ఇంటర్మీడియట్‌ కమిషనర్‌ సూచించిన విధంగా 90 రోజుల ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాము, కళాశాల ప్రిన్సిపాల్‌ సత్యనారాంజనేయులు, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన ఉండాలి





మాట్లాడుతున్న జడ్జి పీబీ కిరణ్‌కుమార్‌

**హుజూరాబాద్‌:** విద్యార్థులకు మానవ హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలని హుజూరాబాద్‌ మండల లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ చైర్మన్‌, జడ్జి పీబీ. కిరణ్‌కుమార్‌ అన్నారు. శనివారం పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్‌ మీడియం స్కూల్‌లో మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చట్టాలపై అవగాహన, ప్రతి మనిషికి జీవించే, స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపై అవగాహన ఉండాలన్నారు. న్యాయవాది సీహెచ్‌ భానుకిరణ్‌, ప్రిన్సిపాల్‌ గీతాషాజు, డైరెక్టర్స్‌ షాజు థామస్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జంగపల్లిలో పోస్టర్‌ ఆవిష్కరణ

**గన్నేరువరం:** బాల్యవివాహాల నిర్మూలన, చట్టాలపై జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీరామానుజాచార్యులు, ప్రొటెక్షన్‌ అధికారి శాంత మాట్లాడుతూ.. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. చిన్నతనంలో పెళ్లి చేస్తే అనేక రకాలుగా ఇబ్బంది పడుతారని, 10వ తేదీ వరకు అవగాహన సదస్సులు కొనసాగుతాయని పోస్టర్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆటోల బంద్‌ విజయవంతం



జమ్మికుంట: ప్లకార్డులతో ఆటోడ్రైవర్ల నిరసన



కేశవపట్నంలో ఆటోడ్రైవర్ల ఆందోళన

**హుజూరాబాద్‌:** ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతిన్నదని ఆటో ఓనర్స్‌ అండ్‌ డ్రైవర్స్‌ అసోసియేషన్‌ మండల అధ్యక్షుడు అరెల్లి రాములు అన్నారు. శనివారం రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌కు మద్దతుగా పట్టణంలో ఆటో డ్రైవర్లు,ఆటో యూనియన్ల నాయకులు బంద్‌ విజయవంతం చేశారు. నాలుగు లక్షల ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, కనీస అవసరాలకు సంపాదన లేక డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్‌ ఇస్తానన్న హామీలను మరిచిందన్నారు.

**గన్నేరువరం:** మండలకేంద్రంలో శ్రీ అంజనేయ ఆటో యూనియన్‌ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**జమ్మికుంట:** పట్టణ, మండలంలోని ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

**శంకరపట్నం:** ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ కేశవపట్నంలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఉచిత బస్సుతో ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా కేశవపట్నంలో ఉండాల్సి వస్తోందన్నారు. ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

## నియామకం

**మానకొండూర్‌:** యువజన కాంగ్రెస్‌ కరీంనగర్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్రీకాంత్‌ నియామకమయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందారు. శ్రీకాంత్‌ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. అలాగే ఓటేసి గెలిపించిన కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**గంగాధర:** పార్టీ బలోపేతానికి నూతనంగా ఎన్నికైన నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. గట్టుభూత్కూర్‌ గ్రామానికి చెందినప బొడ్డు మహేశ్‌ యువజన కాంగ్రెస్‌ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ఎమ్మెల్యే శనివారం మహేశ్‌తో పాటు యువజన కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు పొత్తూరి వంశీని అభినందించారు. గెలుపునకు సహకరించిన నాయకులకు మహేశ్‌ కృతజ్ఞతలు తెలిపాడు.

## సన్మానం

**ఇల్లందకుంట:** యూత్‌ కాంగ్రెస్‌ హుజూరాబాద్‌ మహిళా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గౌడుగు మానస శనివారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ బలోపేతానికి పాటుపడతానని, ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్‌ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

**ఇల్లందకుంట:** యూత్‌ కాంగ్రెస్‌ ఎన్నికల్లో ఇల్లందకుంటకు చెందిన గంగారపు మహేశ్‌ కరీంనగర్‌ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌ పార్టీ హుజూరాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌ శనివారం మహేశ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రణవ్‌ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వాళ్లకు తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాలు

**సైదాపూర్‌:** కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మండలానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌ రూ.40 కోట్లు పనులకు మంజూరు చేయించారని పార్టీ అధ్యక్షుడు దొంత సుధాకర్‌ తెలిపారు. శనివారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిచారు.

**చిగురుమామిడి:** కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని, రానున్న రోజుల్లో మరిన్నిపథకాలు అమలవుతాయని హుస్నాబాద్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, చిగురుమామిడి మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. చిగురుమామిడిలో నాయకులు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. చంద్రశేఖరస్వామి ఆలయంలో పూజలు, ఊరేగింపు నిర్వహించారు.

## వర్షం.. తడిసిన ధాన్యం



**జమ్మికుంట:** ఒక్కసారిగా కురిసిన వర్షానికి జమ్మికుంట వ్యవసాయ పాత మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. కొనుగోళ్లు చివరకు రాగా.. చెరువు కింద పంట వేసిన రైతులు ఆలస్యంగా కోతలు మొదలు పెట్టి ధాన్యం కేంద్రానికి తీసుకువచ్చారు. జక్కె సుమన్‌కు చెందిన 30 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది.

## ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

**హుజూరాబాద్‌:** బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. సమస్యలను పట్టించుకోకుంటే రానున్న రోజుల్లో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. సంస్థగత నిర్మాణంలో భాగంగా మండల, జిల్లా మహాసభలు పూర్తిచేసుకున్నామని, జనవరిలో పార్టీ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డి జిల్లాలో నాలుగు రోజుల పాటు జరుగుతాయని, భవిష్యత్‌ కార్యాచరణ రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు ఇండ్ల స్థలాలు, రేషన్‌ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్‌ చేశారు.

## హామీలు అమలు చేయాలి

**గన్నేరువరం:** కాంగ్రెస్‌ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే సీపీఐ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కార్యకర్తలు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరు గ్యారంటీల్లో ఒకటి, రెండు మాత్రమే అమలవుతున్నాయని, మిగతా వాటిని అమలు చేయాలన్నారు. పార్టీ సభ్యత్వాన్ని విస్తరించాలని, సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తికానున్న సందర్భంగా శతజయంతి ఉత్సవాలు ప్రతీ గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్‌ అధ్యక్షుడు మహేందర్‌, మండల కార్యదర్శి అంజిరెడ్డి, నాయకులు కిష్టయ్య, మల్లయ్య, బోయిని మల్లయ్య, గాజుల లక్ష్మణ్‌, నాగయ్య, ప్రవీణ్‌, గర్శకుర్తి శ్రీనివాస్‌, ఎండీ నయూమ్‌, రాపోలు రాజమల్లు, బోయిని తిరుపతి, సంబు తిరుపతి, మొలుగురి ఆంజనేయులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

● **రాష్ట్రస్థాయికి ఎంపిక**

**మానకొండూర్‌:** ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సీనియర్‌ గర్ల్స్‌ బేస్‌ బాల్‌ క్రీడా పోటీల్లో మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల7 నుంచి 9వ తేదీ వరకు జగిత్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులు మనోజ్ఞ ,అక్షయ, శ్రీ హర్షిత, మధుప్రియ, మధుశ్రీ,, లక్ష్మీప్రసన్నను ప్రిన్సిపాల్‌ పద్మశ్రీ , వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ ఉయ్యాల విష్ణువర్ధన్‌గౌడ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

● **జాతీయ హాకీ జట్టు కోచ్‌గా రవికుమార్‌**

**హుజూరాబాద్‌:** మధ్యప్రదేశ్‌లో ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు జరుగనున్న జాతీయస్థాయి అండర్‌-14 బాలికల హాకీ టోర్నమెంట్‌కు రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా శంకరపట్నం మండలం మెట్టిపల్లి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, పట్టణానికి చెందిన వేముల రవికుమార్‌ ఎంపికయ్యారని పట్టణ హాకీ అసోసియేషన్‌ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్‌ తెలిపారు.

● **తీరిన కానిస్టేబుళ్ల కొరత**

**గన్నేరువరం:** గన్నేరువరంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్ల కొరత తీరింది. ఇటీవల పది మంది విధుల్లో చేరారు. వీరిలో ముగ్గురు మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఎస్సై తాండ్ర నరేష్‌ శనివారం కానిస్టేబుళ్లకు విలేజీ ఆఫీసర్‌ బాధ్యతలు అప్పగించారు.

● **గడ్డి కట్టల తరలింపు**

**చొప్పదండి:** పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయ గోవులకు కొలిమికుంటకు చెందిన తోట సుజాత, రాజన్న దంపతులు శనివారం ట్రాక్టర్‌లో గడ్డి కట్టలను తరలించారు. భక్తులు గడ్డిని సమకూర్చాలని ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగనోమహన్‌ స్వామి కోరారు.

● **10 నుంచి నిరవధిక సమ్మె**

**హుజూరాబాద్‌:** తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు, జిల్లా కమిటీ నిర్ణయం మేరకు కరీంనగర్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి భూపతి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

● **ఓటరు జాబితా విడుదల**

**జమ్మికుంట:** మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఆయా పోలింగ్‌ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రకటించామని ఎంపీడీవో భీమేష్‌ శనివారం ప్రకటనలో తెలిపారు.

● **శంకరపట్నంలో 36,184 మంది ఓటర్లు**

**శంకరపట్నం:** మండలంలో 36,184 మంది ఓటర్లు ఉన్నారని ఎంపీడీవోకృష్ణప్రసాద్‌ తెలిపారు. మొలంగూర్‌, అంబేద్కర్‌నగర్‌ వార్డుల విభజన ప్రక్రియ పూర్తి కానందున రెండు గ్రామాల ఓటరు ముసాయిదా తయారు చేయలేదన్నారు.

● **బీజేపీ సంస్థాగత ఎన్నికల పర్వ్‌**

**హుజూరాబాద్‌:** బీజేపీ హుజూరాబాద్‌ పట్టణ శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత ఎన్నికల పర్వ్‌ పురస్కరించుకుని శనివారం ఎన్నికల ఇన్‌చార్జి,రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ దండు కొమరయ్య బూత్‌ సశక్తికరణ్‌ అభియాన్‌ కార్యక్రమం నిర్వహించారు.

● **గీత కార్పొరేషన్‌ ప్రకటించాలి**

**చొప్పదండి:** కల్లు గీత కార్పొరేషన్‌ వెంటనే ప్రకటించాలని, గౌడ కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ళపల్లి శ్రీనివాస్‌ గౌడ్‌ కోరారు. ఈ మేరకు శనివారం వెనుకబడిన తరుగతుల కమిషన్‌ చైర్మన్‌ భూసాని వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందించారు.

● **ఇసుక ట్రాక్టర్లు పట్టివేత**

**వీణవంక:** మండలంలోని చల్లూరు గ్రామ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

● **చికిత్స పొందుతూ మృతి**

**వీణవంక:** మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఎల్కపల్లి శిరీష(22)అనే యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

**మానకొండూర్‌:** మానకొండూర్‌ మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి గొండ పెద్దన్న (65) నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

● **తండ్రి చెంతకు తనయుడు**

**శంకరపట్నం:** మతిస్థిమితం లేని గట్టు రాజేశ్‌ను శనివారం తండ్రి మొగిలికి అప్పగించినట్లు కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. ములుగు జిల్లా రామప్ప మండలం పాలంపేటకు చెందిన రాజేశ్‌ రెండు రోజులుగా మండలంలో తిరుగుతుండగా స్థానికులు కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు సేకరించి. తండ్రికి అప్పగించారు.

● **ఆర్థికసాయం**

**జమ్మికుంట:** పట్టణంలోని మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన రామిడి సంజీవరెడ్డి,సంధ్య దంపతుల కుమారుడు రమణారెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలకు శనివారం రూ.20వేలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. దాతలకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**తిమ్మాపూర్‌:** మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు దీకొండ రామకృష్ణ ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌ శనివారం పరామర్శించి రూ.5 వేలు, గ్రామానికి చెందిన పెట్టెం రమేశ్‌ రూ.రెండువేలు అందించారు.

● **శ్రీనివాస్‌గౌడ్‌ మృతి తీరని లోటు**

**రామడుగు:** బీజేపీ సీనియర్‌ నాయకుడు పొన్నం శ్రీనివాస్‌గౌడ్‌ మృతి పార్టీకి తీరని లోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో శనివారం శ్రీనివాస్‌గౌడ్‌ సంతాప సభ నిర్వహించగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

● **ఎమ్మెల్యే పరామర్శ**

**శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం, తాడికల్‌, అముదాలపల్లి, లింగాపూర్‌ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. అనంతరం అముదాలపల్లిలో ఉత్తమ రైతు మేకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.

● **పాఠశాల భవనం ఖాళీ చేయాలి**

**హుజూరాబాద్‌:** హైకోర్టు, జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల ఆదేశానుసారం వారం రోజుల్లో పట్టణంలోని ఓ విద్యాలయం నడిచే భవనం ఖాళీ చేయాలని గతంలో ఆదేశించిందని, ప్రస్తుతం గడువు ముగిసినందున స్కూల్‌ యాజమాన్యం భవనాన్ని ఖాళీ చేయాల్సిందిగా మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్‌ శనివారం ఆదేశించారు.

● **జాబ్‌ మేళా వినియోగించుకోవాలి**

**హుజూరాబాద్‌:** పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 9న నిర్వహించే జాబ్‌ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌ ఏనుగు మహిపాల్‌ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు.

● **ముగ్గురికి భూమి పంచాలి**

**మానకొండూర్‌రూరల్‌:** ముగ్గురికి చెందాల్సిన భూమి ఒక్కరికి పట్టా ఎలా చేస్తారని, కోర్టు ఆర్డర్‌ ప్రకారం పంచాలని కోరుతూ అన్నారం కు చెందిన పాకాల శ్రీలక్ష్మి శనివారం తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులకు గోడు వెల్లబోసుకుంది. సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్‌ రాజేశ్వరి అన్నారు.

● **బియ్యం అందజేత**

**వీణవంక:** మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రవీంద్రచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నర్సింగాపూర్‌ గ్రామానికి చెందిన అతిథి డెవలపర్స్‌ అధినేత కొమ్మిడి రాకేశ్‌రెడ్డి తన అనుచరుల ద్వారా యాభై కిలోల బియ్యం అందించారు.

● **కల్యాణ మహోత్సవం**

**హుజూరాబాద్‌:** మున్సిపల్‌ పరిధిలోని కొత్తపల్లి నాగేంద్ర స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది.

● **ఆకస్మిక తనిఖీ**

**హుజూరాబాద్‌:** కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుందని వొడితెల ప్రణవ్‌ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

## ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు, సత్యనారాయణరావు

**జమ్మికుంట:** వెలమ కులాన్ని కించపరుస్తూ మాట్లాడిన షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ బహిరంగా క్షమాపణ చెప్పాలని జమ్మికుంట మున్సిపల్‌ చైర్మన్‌ రాజేశ్వర్‌రావు, మార్కెట్‌ కమిటి మాజీ చైర్మన్‌ సత్యనారాణరావు, ట్రస్మా మండల అధ్యక్షుడు సంపత్‌రావు, వెలమ కుల సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం మున్సిపల్‌ చైర్మన్‌ రాజేశ్వర్‌రావు నివాసంలో మాట్లాడారు.

**హుజూరాబాద్‌:** హుజూరాబాద్‌ డివిజన్‌ వెలమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. తహసీల్దార్‌ కనుకయ్యకు,టౌన్‌ సీఐ తిరుమల్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.